సాక్షి
అనంతపురం

ఆదివారం । 11 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,020 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



విద్య, వైద్యంలో నూతన ఒరవడి

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడి సృష్టించిందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.6°/24.2°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

నేడు మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష

- 1,500 సీట్లకు 2030 మంది విద్యార్థుల పోటీ



రాయదుర్గం మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

రాయదుర్గంటౌన్: ఏపీ మోడల్ స్కూళ్లలో (ఏపీ ఆదర్శ పాఠశాలలు) 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలో 1,500 సీట్లకు గాను 2,030 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాయదుర్గం మోడల్ స్కూల్‌లో 203 మంది, గుత్తి 305, పామిడి 208, గార్లదిన్నె 184, రాప్తాడు 126, శెట్టూరు 129, తాడిపత్రి 177, వజ్రకరూరు 61, కణేకల్లు 72, కళ్యాణదుర్గం 151, పుట్లూరు 110, ఉరవకొండ 95, విడపనకల్లు 63, యాడికి 69, యల్లనూరు 67 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

సారీ తమ్ముడూ.. విధిలేక మోసం చేశా!

- కమీషన్ ఏజెంట్‌కు టోకరా
- రూ.15వేలు నగదు తీసుకుని.. ఫోన్ పే చేయకుండా పరార్
- మోసగాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులుకు సందేశాలు చూపుతున్న బాధితుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాటలు కలిపి.. నమ్మకం కలిగించి.. ముందస్తుగా రూ.15వేల నగదు తీసుకుని.. ఫోన్‌పేలో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయకుండా ఉడాయించిన దుండగుడి ఉదంతం అనంతపురంలో చోటు చేసుకుంది. బాధితుడు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసనగర్‌లోని రామాలయం వద్ద సెల్‌పాయింట్ నిర్వహిస్తున్న మణికంఠ ఫోన్‌పే ట్రాన్స్‌ఫర్, వేలిముద్ర వేయించుకుని కమీషన్‌పై నగదు చెల్లింపులు చేసే ఏజెంట్‌గానూ వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓ అపరిచిత వ్యక్తి అతని వద్దకు వచ్చి ఫోన్ పే ద్వారా బదిలీ చేసి రూ.10వేల నగదు తీసుకున్నాడు. మాటామంతి చేసి అక్కడే కాసేపు గడిపాడు. శనివారం కూడా ఆ వ్యక్తి వచ్చి మణికంఠతో ముచ్చటించిన తర్వాత రూ.15వేల నగదు ఇవ్వు.. ఫోన్‌పేలో డబ్బు పంపుతానని చెప్పాడు. సరేనని కమీషన్ పట్టుకుని నగదు లెక్కపెట్టి మణికంఠ ఇచ్చాడు. అయితే ఆ అపరిచిత వ్యక్తి ఫోన్ పే చేయలేదు. అత్యవసరమన్నట్టుగా.. తన కొడుక్కు డబ్బు ఇచ్చి, తర్వాత ఫోన్‌పే పంపుతానని అక్కడి నుంచి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి మణికంఠ అనుమానం వచ్చి ఆ పరిసరాల్లో వెతికినా కనిపించలేదు. అనంతరం అపరిచిత వ్యక్తి నుంచి మణికంఠకు పలు మెసేజీలు వచ్చాయి. 'సారీ తమ్ముడు..రెండు రోజులుగా అన్నం కూడా లేదు. ఆకలేస్తోంది. విధిలేక నిన్ను మోసం చేయాల్సి వచ్చింది' అంటూ సందేశంలో పేర్కొన్నాడు. బాధితుడు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనకు న్యాయం చేయాలని కోరాడు.

కమ్ముకొస్తున్న.. మధుమేహ మేఘాలు



- ఉమ్మడి జిల్లాలో డయాబెటిస్ రోగులు 23 శాతం
- హైపర్ టెన్షన్ రోగులు 27 శాతం
- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో బట్టబయలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీవనశైలి (లైఫ్‌స్టైల్) జబ్బులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ఈ జబ్బులు విస్తరిస్తుండటం సామాన్యులతో పాటు సంపన్నులనూ కలవరపరుస్తోంది. గతంలో 50 ఏళ్లు పైబడిన వారికే జీవనశైలి జబ్బులు సంక్రమించేవి. ఇప్పుడు 30 ఏళ్ల నుంచే ఈ జబ్బుల బారిన పడుతున్న బాధితులను చూసి వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పట్టణాల్లో ఒత్తిడికి గురవుతున్న వారికి ఎక్కువగా మధుమేహం, రక్తపోటు జబ్బులు వచ్చేవి. ఈ జబ్బులు ఇప్పుడు పల్లెలకూ విస్తరించడంతో జనం విలవిలలాడిపోతున్నారు. మందుల బడ్జెట్.. కుటుంబ వ్యయంలో భాగమైంది.

హైపర్ టెన్షన్ కోరల్లో విలవిల..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు–బీపీ) బాధితులు 27 శాతం వరకూ ఉన్నట్టు తేలింది. పట్టణాల్లో అయితే ఇది 30 శాతం నుంచి 34 శాతానికి పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎవరిని చూసినా ఏదో ఒక అసాంక్రమిక జబ్బుకు లోనై బాధపడుతున్నట్లు ఫ్యామిలీ ఫిజీషియన్ గణాంకాలు చెబుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం మధుమేహం, హైపర్‌టెన్షన్ జబ్బులు నియంత్రణలో లేనివారు ఎక్కువగా ఉన్నారు. జబ్బులపై అవగాహన లేకపోవడం, జబ్బుబారిన పడ్డట్టు తెలియకపోవడం వంటి కారణాలతో అనర్థాలు జరిగాక గానీ తెలుసుకోలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

కేటగిరీ	శాతం
మధుమేహ బాధితులు	23
హైపర్ టెన్షన బాధితులు	27
రెండు జబ్బులతో ఉన్నవారు	19
ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభా	40,15,783
30 ఏళ్లు పైబడిన వారు	20,19,938
వీరిలో డయాబెటిక్ ఉన్నవారు	4,64,585
హైపర్ టెన్షన్‌తో ఉన్నవారు	5,45,383
ఉమ్మడి జిల్లాలో మందుల షాపులు	2,100
షుగర్, బీపీ మందుల విక్రయ వాటా	30 శాతం

నియంత్రణలో లేకపోవడం వల్ల..

- షుగర్ నియంత్రణలో లేకపోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి.
- కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంది.
- గాయాలైనప్పుడు యాంపిటేషన్ (అవయవాలను) తొలగించాల్సి ఉంది.
- మధుమేహం అదుపులో లేకపోతే గుండె జబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువ.
- అధిక రక్తపోటు వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ.
- కిడ్నీల మీద ప్రభావం చూపి, డయాలసిస్ స్థితికి వెళ్లే పరిస్థితి వస్తుంది.

వ్యాయామంతోనే ఆరోగ్యం



కుర్రాళ్లు చిన్న వ్యాయామం కూడా చేయకపోతే జబ్బులు కచ్చితంగా వస్తాయి. ఫారిన్ స్టైల్ అంటూ ఫాస్ట్ ఫుడ్ వెంట పరుగెడుతున్నారు. వ్యాయామం లేదు. టీవీలు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. ఇన్ని రకాల దురలవాట్లు ఉంటే షుగర్, బీపీ మనవెంటే ఉంటాయి. ఈ జబ్బుల ప్రభావం ఇప్పుడు పల్లెలకూ పాకింది. ఇప్పటికైనా కుర్రాళ్లు శారీరక వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– డాక్టర్ వీరబ్బాయి, డీఎంహెచ్‌ఓ

ఆ నాలుగు కారణాలతోనే..



షుగర్, బీపీ వంటి జబ్బులకు ప్రధాన కారణం స్థూలకాయం, ఒత్తిడి, సమతుల ఆహారం లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం. ఈ నాలుగింటి మీద దృష్టిపెడితే బీపీ, షుగర్‌లను నియంత్రించుకోవచ్చు. పల్లెల్లో చాలా చోట్ల పక్షవాతం వచ్చిన తర్వాతగానీ బీపీ ఉందని తెలుసుకోలేక పోతున్నారు.

– డా.వంశీకృష్ణ, కార్డియాలజిస్ట్, అనంతపురం

ముగిసిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ ప్రారంభమైన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు శనివారం ముగిశాయి. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా జరిగిన చివరి రోజు పరీక్షకు 522 మంది అభ్యర్థులకుగానూ 384 మంది (74.56 శాతం) హాజరయ్యారు. 138 మంది గైర్హాజయ్యారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

అనంతపురం సెంట్రల్: జిల్లాలోని స్కూల్ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) పొందాలని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) వీర్రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ప్రకటించారు. ఎఫ్‌సీ లేకుండా విద్యార్థులను బస్సులో తీసుకెళితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అలాంటి వారికి మిగులు ఖాళీలే

- 'తప్పనిసరి' బదిలీ ఉండి దరఖాస్తు చేసుకోని టీచర్లకు మిగులు ఖాళీల్లో ఇవ్వాలంటూ ఆదేశాలు
- స్కూల్ అసిస్టెంట్లు 1,420 మంది బదిలీ, 1,948 మందికి రిటైన్
- ఎస్జీటీ, పండిట్ల నుంచి 122 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతి
- 194 పీఎస్‌హెచ్‌ఎంలకు బదిలీ, 55 మందికి రిటైన్



రాప్తాడురూరల్: తప్పనిసరి బదిలీగా ఉండి దరఖాస్తు చేసుకోని టీచర్లకు మిగులు ఖాళీల్లో మాత్రమే ఇవ్వాలంటూ విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. శనివారం స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజెస్) 1,298 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 640 మందికి బదిలీ కాగా.. 658 మందికి రిటైన్ (పాతస్థానాలు) ఇచ్చారు. ఇంగ్లిష్ 304, హిందీ 143, కన్నడ 3, సంస్కృతం 3, తెలుగు 156, ఉర్దూ ఒక టీచరు బదిలీ అయ్యారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజెస్) 2,192 మంది దరఖాస్తు చేసుకోగా 780 మంది బదిలీ అయ్యారు. మరో 122 మందికి ఎస్జీటీలు, పండిట్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చారు. తక్కిన 1,290 మంది రిటైన్ అయ్యారు. బయలాజికల్ సైన్స్‌లో 145 మంది, గణితం 243 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) 37 మంది, ఫిజికల్ సైన్స్ 165 మంది, సోషల్‌లో 190 మంది టీచర్లు బదిలీ అయ్యారు. పదోన్నతులు పొందిన వారిలో బయలాజికల్ సైన్స్ 2, గణితం 77, పీడీ 5, పీఎస్ 4, సోషల్‌లో 34 మంది ఉన్నారు. ఇక పీఎస్‌హెచ్‌ఎంలకు సంబంధించి మొత్తం 249 మంది దరఖాస్తు చేసుకోగా 194 మందిని బదిలీ చేశారు. 55 మందిని రిటైన్ చేశారు. ఎస్జీటీల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను ఆదివారం జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

వారిని వెంటనే రిలీవ్ చేయాలి..

ప్రమోషన్లు పొందిన, సబ్జెక్టు కన్వర్షన్ ఇచ్చిన, 8 ఏళ్లు సర్వీస్ పూర్తయి బదిలీ అయిన టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ హెచ్‌ఎంలు, ఎంఈఓలను ఆదేశించారు. తక్కిన సబ్జెక్టు టీచర్లు, ఎస్జీటీలకు సంబంధించి వారిస్థానంలో ఎవరైనా వచ్చిన తర్వాతనే రిలీవ్ చేయాలని స్పష్టం చేశారు. టీచరు లేని స్కూల్ ఉండకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. 2008 మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లు పాతస్థానాల్లోనే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంటీఎస్ టీచరును సింగిల్ టీచరుగా ఏ స్కూల్‌కూ ఇవ్వకూడదని, కచ్చితంగా రెండో టీచరు, మూడో టీచరుగా మాత్రమే వారిని తీసుకోవాలని స్పష్టం చేశారు. 1998 ఎంటీఎస్ టీచర్లకు సంబంధించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. బదిలీల్లో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ల స్థానాల్లో పండిట్లను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. అలాగే లాంగ్వేజ్ పండిట్లకు రెండు మూడు రోజుల్లో మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపడతామన్నారు.





ఆకాశంలో కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

హరివిల్లు.. కనువిందు

గుంతకల్లులో శనివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వర్షం ఆగిన తర్వాత ఆకాశంలో రంగురంగుల ఇంద్ర ధనుస్సు ఏర్పడింది. కొన్ని క్షణాలపాటు ఈ దృశ్యం కనువిందు చేసింది. – గుంతకల్లు టౌన్:

క్లుప్తంగా

230 మందికి అక్రిడిటేషన్లు

• వివరాలు వెల్లడించిన కలెక్టర్ గౌతమి



అనంతపురం అర్బన్: జిల్లాలో అర్హత కలిగిన 230 మంది మీడియా ప్రతినిధులకు రెండేళ్ల కాలపరిమితితో చెల్లుబాటు అయ్యేలా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఎం.గౌతమి తెలిపారు. వివరాలను శనివారం ఆమె వెల్లడించారు. ప్రభుత్వ జీఓ నిబంధనల మేరకు అర్హత ఉన్న పాత్రికేయులకు అక్రిడిటేషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు సమర్పించిన ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, వెటరన్ జర్నలిస్టులకు మొత్తం 230 మందికి అక్రిడిటేషన్ మంజూరు చేశామన్నారు. తొలి విడతలో అక్రిడిటేషన్ మంజూరు కాని వారు తమ దరఖాస్తుతో పాటు జీఓలోని నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్లన్నీ ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన తర్వాత కమిటీ సమావేశంలో పరిశీలించి రెండో విడతలో అక్రిడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

భూసార సంరక్షణ విభాగం డీడీగా శివప్రసాద్



శివకుమార్‌ను అభినందిస్తున్న ఏడీఏలు శ్రీనివాసులు, ఓబుళపతి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: భూసార సంరక్షణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ)గా జీవీ శివకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న డీడీఏ జి.తిరుపతయ్య ఏలూరు ఆత్మ డీపీడీగా బదిలీ కాగా... ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా ఎస్‌సీ డీడీఏ శివకుమార్‌ను బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్థానిక వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయంలో ఉన్న ఎస్‌సీ ఆఫీసులో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఏడీఏలు ఆర్.శ్రీనివాసులు, సి.ఓబుళపతి, సూపరెండెంట్ పద్మావతి తదితరులు అభినందనలు తెలిపారు.

విద్య, వైద్య రంగాల్లో నూతన ఒరవడి

• కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన
• 'ఫ్యామిలి డాక్టర్'తో వైద్య సేవలు మరింత విస్తృతం : కలెక్టర్



బెళుగుప్పలో నూతన పీహెచ్‌సీని త్వరగా ప్రారంభించాలని వైద్యాధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ గౌతమి

బెళుగుప్ప: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో నూతన ఒరవడి సృష్టించిందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శనివారం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ వీరబ్బాయితో కలసి కలెక్టర్ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత బెళుగుప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి త్వరితగతిన నిర్మాణపనులు పూర్తి చేయాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల గురించి ఎంఈఓ మల్లారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నందున సంసిద్ధంగా ఉండాలన్నారు. తదనంతరం కేజీబీవీలో వసతి గదులను పరిశీలించారు. అటు నుంచి బెళుగుప్ప పీహెచ్‌సీని పరిశీలించి వసతులు, ఓపీ అంశాలపై ఆరా తీశారు. ఆ తర్వాత నరసాపురం హెల్త్ సబ్ సెంటర్‌ను పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్య సేవలు విస్తృతం చేయాలని వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, రిషి, లోకేష్‌లకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా డిజిటల్ బోధనకు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 537 పాఠశాలల్లో 1,790 డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు 65 ఇంచుల (ఎఫ్‌పీబీ) డిజిటల్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను పంపి, వాటిపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులతో మెరుగైన ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జగనన్న ఆణిముత్యాలు పేరిట పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ నెల 15, 17 తేదీల్లో జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. ఇక వైద్య రంగంలో ఖాళీ పోస్టులు భర్తీ చేశామని, నూతన పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ యుగంధర్, తహసీల్దార్ హుస్సేన్ పీరా, ఎంపీడీఓ రామచంద్ర, ఆర్ఐ నగేష్, పీఓ సుజాత, ఎన్‌సీడీ నారాయణస్వామి, పీఆర్ జేఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

కళ్యాణదుర్గం: నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి సూచించారు. కళ్యాణదుర్గం మండలంలోని గూబనపల్లి, కురాకులతోట లే అవుట్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, హౌసింగ్ డీఈ శైలజ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, డీఎల్‌డీఓ శంకర్, తహసీల్దార్ ఫణికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, డీఎస్పీ బి.శ్రీనివాసులతో కలిసి కలెక్టర్ ఆయా లే అవుట్లను పరిశీలించి, కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు. అనంతరం సిమెంటు ఇటుకలు, క్యూరింగ్ తదితర వాటిపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. గడువులోపు పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ, ఏఈ రామ్మోహన్, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కానుక సిద్ధంగా ఉంచుకోండి

అనంతపురం అర్బన్: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సోమవారం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ గౌతమి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలు, విద్యాకానుక అంశాలపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పండుగ వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించారు. తరగతి గదులు, పాఠశాల ఆవర పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించాలని చెప్పారు. పాఠశాలలకు ఏఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు అందుకున్నవారు వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

1,786 మట్టి నమూనాల విశ్లేషణ

• భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ఎరువుల ఖర్చు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంలో భాగంగా జిల్లాలో మట్టి పరీక్షల విశ్లేషణ చేపట్టినట్లు భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత తెలిపారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రతి ఆర్‌బీకే పరిధిలో రెండు చొప్పున తొలివిడతగా అనంతపురం జిల్లాలో 918, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 434... మొత్తంగా 1,786 మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు వివరించారు. ఒక్కో నమూనా నుంచి 12 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్ఫరస్ (పీ), పోటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి క్రోడీకరించనున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల భూమిలో ఉన్న పోషకాల లభ్యత, లేనివి, వాటి శాతం ఎంతనేది తెలుస్తుందన్నారు. వాటి ఆధారంగా రైతులు సాగు చేసే పంటలను బట్టి ఎరువులను సిఫారసు చేయనున్నామన్నారు. ప్రతి రైతు తన పొలానికి సంబంధించి కనీసం మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చినందున మట్టి పరీక్షల విశ్లేషణ ఖచ్చితంగా చేపడుతున్నట్లు తెలిపారు.

16 వేల పశువులకు వైద్య సేవలు



వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ నరేష్ యాదవ్

కూడేరు: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 16,100 పశువులకు వైద్య సేవలందించినట్లు జిల్లా కో ఆర్డినేటర్ నరేష్ యాదవ్ తెలిపారు. శనివారం కూడేరులో సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా అందే సేవలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్ సదుపాయంతో పాటు డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉంటారన్నారు. పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినా, ప్రసవం కష్టంగా ఉన్నపుడు వెంటనే 1962 హెల్ప్‌లైన్‌కు సమాచారమిస్తే మీ ప్రాంతానికే వచ్చి వైద్య సేవలందిస్తారన్నారు. సీరియస్‌గా ఉంటే వెంటనే అనంతపురంలోని ఏరియా వెటర్నరీ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు చేపడతారన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి రెండు చొప్పున జిల్లాలో 14 పశు ఆరోగ్య సేవ వాహనాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 27,377 ఫోన్ కాల్స్ రాగా 16,100 పశువులకు వైద్య సేవలందించినట్లు తెలిపారు. అరుదైన శస్త్ర చికిత్సలు చేసి పశువులకు ప్రాణం పోశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, వెటర్నరీ అసిస్టెంట్ దివ్యశ్రీ, డ్రైవర్ సూర్యనారాయణ, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వివాహాలకు పేర్లు నమోదు చేసుకోండి

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పైలా నరసింహయ్య దంపతులు

అనంతపురం క్రైం: పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19న పెన్నహోబిలంలో ఉచిత సామూహిక వివాహాలను జరిపించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను తన సతీమణి పైలా రమాదేవితో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆగస్టు 19న ఉదయం 5.55 నుంచి 8.55 గంటల్లోపు పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరిగే ఉచిత సామూహిక వివాహాల వేడుకలో పాల్గొనే వధూవరులకు నూతన వస్త్రాలు, తాళిబొట్టు, మెట్టెలు ఇస్తామన్నారు. వివాహానికి వచ్చే వారందరికీ టిఫిన్, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 75699 81330, 94906 24624లో సంప్రదించాలని కోరారు.

వడ్డెర్లకు అండగా ఉంటా

• ఎమ్మెల్సీ ఏసురత్నం



ఎమ్మెల్సీ ఏసురత్నంను కలిసిన స్థానిక వడ్డెర్లు

కళ్యాణదుర్గం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వడ్డెర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం భరోసానిచ్చారు. వడ్డెర్ల పిలుపు మేరకు శనివారం కళ్యాణదుర్గానికి వచ్చిన ఆయన.. స్థానిక మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సల్లా మారుతి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 25 వేలకు పైగా వడ్డెర్లు ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో చాలా మంది సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అయ్యారని గుర్తుచేశారు. ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుని పిల్లలకు ఉన్నత విద్యాబుద్ధులు చెప్పించాలని వడ్డెర్లకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీని స్థానిక వడ్డెర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు గంగాధర్, నాయకులు వెంకటేశ్వర్లు, యశ్వంత్, రమేష్, నాగభూష తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని జీసస్ నగర్‌లో ఉన్న ప్రీ మెట్రిక్ మైనారిటీ బాలికల వసతి గృహంలో ప్రవేశానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మహమ్మద్ రఫీ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైనారిటీ విద్యార్థినుల (ముస్లిం/క్రైస్తవ/సిక్కు/పారశీ/బౌద్ధ)కు 87 శాతం సీట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు 10 శాతం, విభిన్న ప్రతిభావంతులకు 3 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. అనంతపురానికి 5 కిలోమీటర్లకు పైబడి దూరంలో ఉన్న వారు, 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న బాలికలు అర్హులు. వంద మంది విద్యార్థినులకు ప్రవేశం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 97039 42423లో సంప్రదించవచ్చు.

డీఐజీ ఆకస్మిక తనిఖీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్పతో కలసి పాతూరు వీధుల్లో తిరిగారు. ఇరుకు వీధుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యకు తప్పక పరిష్కారం చూపించాలన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ స్టేషన్‌లోని ప్రతి పోలీసు రోడ్లపైకి చేరుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, గస్తీ చేపట్టాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాలన్నారు.

మురుగు కాలువలో మృత శిశువు



గుంతకల్లు రూరల్: స్థానిక సత్యనారాయణ పేట రైల్వే బ్రిడ్జి కింద ఉన్న మురుగు కాలువలో శనివారం మృతశిశువు లభ్యమైంది. రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపిన మేరకు.. కాలువలో శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందజేయడంతో కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి ఖననం చేసేందుకు మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. 4 నుంచి వారం రోజుల మధ్యలో శిశువును నీటిలో పడేసినట్లుగా భావిస్తున్నారు. కాగా శిశువు మృతిచెందిన తర్వాత కాలువలో పడేశారా, లేక బతికుండగానే పడేశారా అన్నది తెలియరాలేదు.

వ్యక్తి దుర్మరణం

డి హీరేహాళ్(రాయదుర్గం): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రాంపురానికి చెందిన మధుసూదన్ (51), తన స్నేహితుడు మల్లికార్జునలతో కలసి బోర్‌వెల్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం రాంపురం సమీపంలో బోరు బావి వేయించేందుకు బళ్లారి నుంచి బోరు వాహనంతో పాటు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. డి హీరేహాళ్ మండలం మడెనహళ్లి టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే ద్విచక్ర వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో మధుసూదన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా



హనీఫ్ (ఫైల్)

యాడికి: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న మోహన్, రమీజా దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు హనీఫ్(20) తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనం రిపేరీ షాపులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం మండలంలోని కోనుప్పలపాడు సమీపంలో ఓ శుభకార్యానికి హాజరైన హనీఫ్... తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు స్నేహితులు మారుతి, మల్లికార్జునతో కలిసి కోనుప్పలపాడు రహదారిలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. ఈత కొట్టిన కాసేపటి తర్వాత స్నేహితులు పైకి వెళ్లారు. హనీఫ్ ఎంత సేపటికి పైకి రాకపోవడంతో బావిలో చూడగా కనిపించలేదు. భయపడిన స్నేహితులు వెంటనే సమాచారం అందించడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని బావిలో గాలించి హనీఫ్ మృతదేహాన్ని వెలికి తీశారు. విషయం తెలుసుకున్న మోహన్, రమీజా అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

సీమంతంలో అపశ్రుతి

కంబదూరు: మండలంలోని అండేపల్లిలో శనివారం ఓ ఇంట్లో జరిగిన సీమంతం కార్యక్రమంలో భోజనం చేసిన 20 మంది అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, విరేచనాలతో బాధపడుతున్న 15 మందికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందజేశారు. మరో ఐదుగురు కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రిలో చేరారు. ఘటనపై అప్రమత్తమైన డాక్టర్ ఆషియా బేగం వెంటనే అండేపల్లి గ్రామానికి వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 40మందికి చికిత్సలు అందజేశారు.

చెట్టు మీద పడి చిన్నారి మృతి

పూతలపట్టు: మండలంలో శనివారం పెనుగాలులకు తాటి చెట్టు కూలి మీద పడడంతో ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసుల తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన టి.ప్రకాష్ కుటుంబంతో కలిసి ఏడాది క్రితం పూతలపట్టు మండలం గువ్వలకాలనీకి వచ్చాడు. అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం పెను గాలులు వీయడంతో ప్రకాష్ కూతురు సిరి(6), భార్యతో కలసి పక్కనున్న తాటి చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో తాటిచెట్టు కూలి మీదపడడంతో తీవ్రంగా గాయపడిన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంచకుడి అరెస్ట్

బొమ్మనహాళ్: ప్రేమ పేరుతో ఓ బాలికను వంచనకు గురిచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను రాయదుర్గం సీఐ యుగంధర్, బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ శనివారం వెల్లడించారు. అనంతపురం సమీపంలోని కురుకుంట గ్రామానికి చెందిన వి.వన్నూరుస్వామి బొమ్మనహాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని ప్రేమ పేరుతో నమ్మించి గత నెల 29న తనతోపాటు పిలుచుకెళ్లాడు. అనంతరంబాలికను శారీరకంగా లోబర్చుకున్నాడు. యువకుడి చెర నుంచి తప్పించుకుని వచ్చిన బాలిక తల్లిదండ్రుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఉదయం ఉప్పరహాళ్ క్రాస్‌లో తచ్చాడుతున్న యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

టూటౌన్ సీఐని సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర

అనంతపురం టవర్‌క్లాక్: దళిత నాయకులపై దురుసుగా ప్రవర్తించిన టూటౌన్ సీఐ శివరాముడును సస్పెండ్ చేయాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కోర్టు ఆవరణలో అగ్రకుల నాయకులు దళితులపై దాడి చేశారన్నారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కేసు నమోదు చేయకుండా వారితో రాజీపడాలని చెప్పడం న్యాయం కాదన్నారు. దళితులకు అండగా దళిత సంఘం నాయకులు సీఐని కలిసి వారిపై కేసు నమోదు చేయాలని కోరితే పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఐఎంఎం బాషా, గోగులమూర్తి, రామకృష్ణ, గోవిందు, కృష్ణ, దాదు, బాషా, కిరణ్, ఏ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్‌లో విద్యార్థుల భాగస్వామ్యం పెంచాలి



కవి దత్తాత్రేయ మృతికి సంతాపం తెలుపుతున్న ఇంటాక్ సభ్యులు

అనంతపురం కల్చరల్: ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ)లో విద్యార్థుల భాగస్వామ్యం పెంచేలా విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం చేయాలని ఇంటాక్ అధ్యక్షుడు రామ్‌కుమార్ అన్నారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఇంటాక్ సర్వసభ్య సమావేశం జరిగింది. రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, మాజీ అధ్యక్షుడు ఏజీ వేణుగోపాలరెడ్డి, రైతు సంఘం నాయకుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కవులు నబీ రసూల్, జూటూరు షరీఫ్, మాజీ డిప్యూటీ డీఈవో ఖాశీంఖాన్, చిత్ర దర్శకుడు రషీద్ తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. తొలుత ఇటీవల మరణించిన కవి, సామాజిక వేత్త గోళ్ల దత్తాత్రేయ శర్మ మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన సాహిత్యంలో చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు చేరాల్సిన సర్టిఫికెట్లను సభ్యులకందించారు.

రాధాకృష్ణమూర్తి జీవితం ఆదర్శప్రాయం




మాట్లాడుతున్న మానవత సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: అభ్యుదయ వాది, స.హ.చట్టం ప్రచారకుడు బీవీ రాధాకృష్ణమూర్తి జీవితం ఆదర్శప్రాయమని మానవత సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమరనాథరెడ్డి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు రాధాకృష్ణమూర్తి 90వ జన్మదిన వేడుకలను జేవీవీ నాయకులు శనివారం నిర్వహించారు. స్థానిక ప్యారడైజ్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి జేవీవీ ప్రతినిధి తరిమెల రాజు అధ్యక్షత వహించారు. అమరనాథరెడ్డి, డాక్టర్ గేయానంద్, జేవీవీ జాతీయ నాయకులు మహ్మద్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందనాయక్ తదితరులు రాధాకృష్ణమూర్తిని సన్మానించారు. కృష్ణాజిల్లా వాసి అయిన రాధాకృష్ణమూర్తి దశాబ్దాల పాటు జిల్లాలో అనేక అభ్యుదయ పోరాటాలకు ప్రాతినిధ్యం వహించారన్నారు. ఆయన స్ఫూర్తిని అందరిలో నింపాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జేవీవీ నాయకులు రాధాకృష్ణమూర్తి దంపతులను సత్కరించారు.

వేసవి వెళ్లెను.. రుతు పవనం కదిలెను

జూన్ రెండో వారం ప్రారంభమైనా నిప్పుల వాన కురుస్తోంది. పగలంతా ఎండలు మండుతున్నాయి. సాయంత్రం నుంచి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.. రోహిణి కార్తె వెళ్లింది.. మృగశిర కార్తె ప్రవేశించినా ఇంకా వేసవిని తలపిస్తోంది. ఉన్నట్లుండి శనివారం సాయంత్రం ఆకాశం చల్లబడింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపర్ జోయ్' తుపాన్ ప్రభావంతో రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లయ్యింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆకాశంలో మెరుపులు



సాయంత్రం వేళ ఆకాశం ఇలా...



రాజీవ్ కాలనీ వద్ద కమ్ముకున్న కారుమబ్బులు



అస్తమిస్తున్న సూర్యుడు

ఆహా.. స్లీపర్ బెర్తు దొరికింది!



ఓ వైపు ఎండలు మండుతున్నాయి.. మరోవైపు ఉక్కపోత.. ఎండ వేడికి తాళలేక మనుషులే కాదు.. పశుపక్ష్యాదులు సైతం అల్లాడుతున్నాయి. కాసింత నీడ దొరికితే చాలు.. అక్కడ చేరి సేదతీరుతున్నాయి. వీధి కుక్కలైతే చెట్ల నీడకు చేరిపోతుంటాయి.. అనంతపురం రైల్వే స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో మూడు శునకాలు ఇలా తలోచోట చేరి, చల్లగా నిద్రించడం చూసి ప్రయాణికులు ఆహా ఏమి హాయిలే 'భౌ'లా అనుకున్నారు. రైల్వే సిబ్బంది కూడా నిద్రాభంగం కలిగించకూడదనుకున్నారో ఏమో చూసీ చూడనట్లు ఉండిపోయిన దృశ్యం 'సాక్షి' కెమెరాకు ఇలా చిక్కింది.

– అనంతపురం సిటీ

ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దు



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ బీవీ శివారెడ్డి

రాప్తాడురూరల్: యువత ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం రూరల్ పీఎస్ పరిధిలోని బళ్లారి రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివారెడ్డి మాట్లాడుతూ రూల్స్‌ను అతిక్రమించారంటూ రోజూ పోలీసులు రూ. 100 ఫైన్ వేయడం వల్ల మీకు జరిగే నష్టం ఏమీ ఉండదన్నారు. ఎవరికి వారు తెలుసుకోవాలన్నారు. కనీసం హెల్మెట్ వినియోగించాలన్న స్పృహ లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. వాహనాలు రోడ్డుపైకి వచ్చాయంటే రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులు తమపైనే ఆధారపడ్డారనే విషయాన్ని ప్రతి డ్రైవరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐలు వెంకటరమణ, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాములాయి చెరువు పక్కన బహిరంగంగా పేకాట ఆడుతున్న 16 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్ వెల్లడించారు. అందిన సమాచారం మేరకు పాములాయి చెరువు వద్దకు చేరుకున్న ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది.. కంప చెట్లలో పేకాట ఆడుతున్న పలువురిని గుర్తించారు. అయితే ఖాకీ యూనిఫాం కనిపిస్తే వారు తప్పించుకుని పారిపోయే అవకాశం ఉండడంతో పోలీసులు వెంటనే పంచెలు, లుంగీలు కట్టుకుని అక్కడకు చేరుకున్నారు. వస్తున్నది జూదరులేననే నమ్మకంతో పేకాటరాయుళ్లు అక్కడి నుంచి కట్టుకదల్లేకపోయారు. దీంతో వారిని పోలీసులు చుట్టుముట్టి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 13 సెల్‌ఫోన్లు, 8 బైకులు, రూ. 65,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రుద్రంపేట పంచాయతీలో నూతన సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను ఆయన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి : నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. నాలుగు పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలో దాదాపు రూ.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న మూడు నెలల్లో రుద్రంపేటకు వెళ్లే రహదారి విస్తరణ పనులతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే దాదాపు రూ. 75 కోట్లతో పనులు చేపట్టి పీఏబీఆర్ నీరు ప్రజలకు అందించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో రుద్రంపేట సర్పంచ్ పద్మావతి, అనంతపురం రూరల్, రాజీవ్‌కాలనీ పంచాయతీల సర్పంచ్‌లు ఉదయ్‌శంకర్, ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీలు నారాయణమ్మ, ఓం ప్రకాష్, మహబూబీ, ఆశాజ్యోతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, జేఏసీ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, సాధిక్‌వలి, చంద్రశేఖర్, కుల్లాయప్ప, తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

13న అర్చక సమాఖ్య సమావేశం

అనంతపురం కల్చరల్: ఈ నెల 13న ఏపీ అర్చక సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాఖ్య అధ్యక్షుడు పూజారి భీమప్ప, కార్యదర్శి తిమ్మరాజు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం అనంతపురం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో జరిగే సమావేశానికి జిల్లాలోని అర్చకులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. అర్చకుల సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వివరించారు.

ఆటో అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్నూలు జిల్లా యర్రగుడికి చెందిన బాలకృష్ణ ఆటోలో అదే గ్రామానికి చెందిన రైతుల పశువులను అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం జరిగిన పశువుల సంతకు తీసుకొచ్చాడు. బాలకృష్ణ ఆటోను పార్కింగ్ చేసి, మార్కెట్‌లోకి వెళ్లాడు. పశువులు విక్రయించాక రైతులతో కలిసి బాలకృష్ణ ఆటో వద్దకు చేరుకున్నారు. పార్కింగ్ చేసిన స్థలంలో ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు అనంతపురం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలు



ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖితను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ

అనంతపురం: విద్యార్థుల సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 33 రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో దోహదపడిందన్నారు. తీరిక వేళల్లో గ్రంథాల పఠనం, యోగా, కథలు చెప్పడం, డ్రాయింగ్, పేపర్ చదివే అభిరుచిని పెంపొందించారన్నారు. ఇలాంటి కార్యక్రమాలను 33 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 శాఖా గ్రంథాలయాల్లో 2 వేల మందికి పైగా విద్యార్థులు వివిధ అంశాల్లో శిక్షణ పొందారన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పుస్తక పఠనం, కథలు, దిన పత్రికలు చదవడం, ప్రశాంతతకు యోగా, ఆత్మరక్షణకు కరాటే, ఉల్లాసానికి డ్యాన్స్ తదితర అంశాల్లో నిష్ణాతులతో శిక్షణ ఇప్పించామన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ, ఉప గ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరామనామ సంకీర్తన



పూజలందుకున్న కోదండరాముడు

అనంతపురం కల్చరల్: అఖండ శ్రీరామనామ సంకీర్తనతో రెవెన్యూ కాలనీ కోదండరామాలయం మార్మోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు శ్రీరామ..జయరామ అంటూ భక్తబృందాలు స్వామి నామాన్ని జపించారు. శనివారం లోక కల్యాణార్థం ఆలయంలో జరిగిన అఖండ శ్రీరామనామ సంకీర్తనను విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ప్రారంభించారు. సాయంత్రం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య బృందం కోలాటంతో భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామికి నీరాజనాలర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రామయ్య గుప్తా, మెళవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అఖండ రామనామ సంకీర్తనను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారామాంజనేయులుకు అలంకార సేవలు, అభిషేకాలు, తీర్థప్రసాద వితరణ చేశారు.

ఆలయ గోపుర నిర్మాణానికి భారీ విరాళం



విరాళం అందిస్తున్న గంగుల భానుమతి

కనగానపల్లి: మద్దెలచెరువులో వెలసిన తిమ్మప్పస్వామి ఆలయ గోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి రూ.6 లక్షల విరాళం ప్రకటించారు. గ్రామంలో రెండు రోజుల నుంచి తిమ్మప్పస్వామి పరుష జరుగుతోంది. శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గంగుల భానుమతి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ఆలయ గోపురానికి తనవంతు విరాళాన్ని అందించారు. గ్రామంలో నిర్వహించిన రాతిదూలం పోటీల్లో గెలుపొందిన వారికి రైతులకు ఆమె బహుమతులు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఏజెన్సీ, సిబ్బందితో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం రాచానపల్లి లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకూడదన్నారు. అమినిటీలు వివిధ దశల్లో జియో ట్యాగింగ్ చేసి నిర్మాణాలను ముమ్మరం చేయాలన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని అమినిటీలను కమిషనర్ హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థలో అమినిటీలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకిచ్చిన నిర్మాణ సామగ్రికి సంబంధించి వివరాలను నమోదు చేయకపోవడంపై కొందరు అమినిటీలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు అందించిన సామగ్రికి సంబంధించి నివేదికను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయాలన్నారు.

జగన్‌తోనే మైనార్టీల సంక్షేమం



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం సిటీ: మైనార్టీల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మేయర్ వసీం అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాథ్' కార్యక్రమాన్ని అనంతపురంలోని చాందినీ మసీదులో నిర్వహించారు. పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మొఘల్ సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన బాటలోనే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ షాదీ తోఫా, పేద ముస్లింలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తూ మైనార్టీల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నట్లు తెలిపారు. మసీద్ పెద్దలతోపాటు కార్పొరేటర్ ఇషాక్, పార్టీ నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, జావీద్, షంషుద్దీన్, మదార్‌వలి, ఖాదర్, గఫార్, ఖాజా, బాకే హబీబుల్లా, షెక్షావలి పాల్గొన్నారు.

నాట్యాచార్యులు మంజులవాణికి నంది అవార్డు



నంది అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన నాట్యాచార్యులు మంజులవాణికి నంది అవార్డు దక్కింది. శనివారం సికింద్రాబాద్‌లోని నటరాజ అకాడమీ, కళ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాట్య గురువులను స్వర్ణకంకణ, గజమాలతో సత్కరించారు. నిర్వాహకులు డాక్టర్ శ్రవన్‌కుమార్, ప్రసూన, సంగీత దర్శకుడు రవికల్యాణ్ చేతుల మీదుగా నంది అవార్డును బహూకరించారు.

12న ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను ఈనెల 12న వేలం వేయనున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం పాటలో పాల్గొన దలిచిన వారు రూ. 3 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

వృద్ధుడి మొబైల్ ఎత్తుకెళ్లిన యువకుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక శ్రీకంఠంసర్కిల్‌లో ఓ వృద్ధుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఎత్తుకెళ్తున్న బాలుడిని ఆటోడ్రైవర్లు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన శనివారం జరిగింది. ఉదయం 9 గంటల సమయంలో నార్పల వైపు నుంచి వచ్చిన వృద్ధుడు ఆర్టీసీ బస్టాప్‌లో దిగగా, బాలుడు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. విషయాన్ని గుర్తించిన ఆటోడ్రైవర్లు బాలుడిని వెంబడించి, వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు బాలుడి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితుడికిచ్చి పంపారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం నగరంలోని వివిధ నవోదయ కాలనీ, బుడ్డప్పనగర్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రోడ్లపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. క్లాప్ ఆటో నిర్వహణ ఏవిధంగా జరుగుతోందని ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తీసుకెళ్లాలని క్లాప్ ఆటో సిబ్బందికి తెలిపారు.

పూడిక తీత పనులు: పారిశుధ్య కార్యదర్శులు విధులకు గైర్హాజరవడంతో ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి వివిధ డివిజన్లలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. వర్షాలు కురుస్తున్నాయని, ముందస్తుగా కాలువల్లో పూడికను తీయించారు. కాలువలు బ్లాక్ కాకుండా చర్యలు తీసుకున్నారు.

మహిళపై కత్తితో దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక పాతూరు కాయగూరల మార్కెట్‌లో గంగమ్మ అనే మహిళపై బోయ హరి అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన మేరకు.. గంగమ్మ కుమార్తె తల్లి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో బోయహరి ఆమెకు దగ్గర కావాలనుకున్నాడు. విషయం తెలుసుకున్న గంగమ్మ తన కుమార్తెను హరి నుంచి దూరంగా ఉంచింది. దీన్ని జీర్ణించుకోలేని హరి తమ మధ్య గంగమ్మ అడ్డుగా ఉందని ఆమెపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు స్పందించి అతన్ని అడ్డుకున్నారు. దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. శనివారం పోలీసులు బోయ హరిని అరెస్ట్ చేశారు.